


జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| గురువారం 21 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 353 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రెస్ మీట్: ఏపీలో శాంతిభద్రతల క్షీణతపై తీవ్ర ఆందోళన

అమరావతి, సందేశం టైమ్స్ ప్రతినిధి, 21 మే 2026: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలు, ఆస్తుల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని బ్రతికించాలని, అరాచక శక్తులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వ వేధింపులపై చట్టపరంగా, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.



## ఘోస్ట్ సిమ్ నెట్‌వర్క్‌పై హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.O'.. 66 మంది నిందితులు అరెస్ట్

హైదరాబాద్, సందేశం టైమ్స్, శెట్టి వెంకటేష్: సైబర్ నేరగాళ్లకు ప్రధాన అడ్డాగా మారిన ఘోస్ట్ సిమ్ నెట్‌వర్క్ వ్యవస్థపై హైదరాబాద్ సిటీ పోలీస్ ఉక్కుపాదం మోపుతూ 'ఆపరేషన్ ఆక్టోపస్ 3.O'ను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. గతంలో మ్యూల్ ఖాతాదారులు, అక్రమాలకు సహకరించిన బ్యాంకు అధికారులపై కఠిన చర్యలు తీసుకున్న పోలీసులు, ప్రస్తుతం సైబర్ నేరాలకు మూలకారణంగా మారిన ఘోస్ట్ సిమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా రంగంలోకి దిగిన 18 ప్రత్యేక బృందాలు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించి, మొత్తం 66 మంది నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వారి వద్ద నుంచి 544 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నాయి. విచారణలో ఈ ఘోస్ట్ సిమ్ కార్డుల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు రూ.101.87 కోట్ల విలువైన 76 సైబర్ నేరాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. అరెస్టయిన వారిలో నిబంధనలను బేఖాతరు చేసిన వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్‌లకు చెందిన 20 మంది పాయింట్ ఆఫ్ సేల్ (PoS) ఏజెంట్లు కూడా ఉండటం గమనార్హం. వీరి మోసపూరిత విధానం (Modus Operandi) అత్యంత ప్రమాదకరంగా సాగుతోందని, అమాయక వినియోగదారులకు 'సర్వర్ డౌన్' అని అబద్ధం చెప్పి వారి నుంచి అదనపు బయోమెట్రిక్ సేకరించడం లేదా గ్రామాల్లో ఉచిత ఇంటర్నెట్ ఆశచూపి నిరక్షరాస్యుల పేరుతో నకిలీ సిమ్ కార్డులను సృష్టిస్తున్నారని పోలీసులు వెల్లడించారు. ఇలా యాక్టివేట్ చేసిన సిమ్ కార్డులను వెంటనే 'ఈ-సిమ్' (e-SIM)లుగా మార్చి విదేశాల్లోని సైబర్ ముఠాలకు చేరవేస్తున్నారని, తద్వారా మన దేశ నంబర్లతోనే వాట్సాప్, టెలిగ్రామ్ ఖాతాలు తెరిచి సెక్స్‌టార్షన్, డిజిటల్ అరెస్ట్ వంటి ఘోరమైన మోసాలకు పాల్పడుతున్నారని, లక్ష్యం నెరవేరగానే ఏజెంట్లు తమ దుకాణాలు మూసేసి పరారవుతున్నారని పేర్కొన్నారు. ఈ ముప్పును పూర్తిగా అరికట్టడానికి హైదరాబాద్ సిటీ పోలీస్ ్టవరలోనే టెలికాం సంస్థల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం కానుందని, కేవైసీ ప్రక్రియను మరింత కఠినతరం చేయాలని, నిబంధనలు పాటించని ఏజెంట్లను అన్ని నెట్‌వర్క్‌ల నుంచి బ్లాక్ లిస్ట్ చేయాలని DoT మరియు TRAI ని కోరనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఆధార్, బయోమెట్రిక్ వివరాలను ఎవరికీ ఇవ్వకూడదని, తమ పేరు మీద తెలియకుండా ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో tafcop.sancharsaathi.gov.in పోర్టల్ ద్వారా వెంటనే తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని, ప్రజల రక్షణ కోసం హైదరాబాద్ సిటీ పోలీస్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.



## నేడే సరస్వతీ అంత్య పుష్కరాల ప్రారంభం.. కంచి స్వామి, గవర్నర్‌లచే తొలి పుణ్యస్నానం

కాళేశ్వరం, సందేశం టైమ్స్ ప్రతినిధి, 21 మే 2026: కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను పూర్తి చేసింది. మే 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు ఈ పుష్కర స్నానాలు జరగనున్నాయి. ఈ పుష్కరాలకు దాదాపు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టింది. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను తీసుకుంది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద చాపలు, చలువ పందిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో 245 ఎకరాల్లో దాదాపు లక్షా 70 వేల వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయడంతో పాటు, రహదారుల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించింది. పుష్కరాల తొలిరోజైన 21వ తేదీ తెల్లవారుజామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గారలు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. జూన్ 1వ తేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామీజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం ఆచరిస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, హారతి, తెప్పోత్సవాలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం 90 ప్రత్యేక బస్సులను, నిరంతర విద్యుత్ సరఫరాను, దాదాపు 500 తాత్కాలిక శౌచాలయాలను, తాగునీటి కోసం రెండు నీటి నిల్వ ట్యాంకులను నిర్మించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో ప్రత్యేకంగా ఒక వస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మించారు. పుష్కర ఘాట్ లోని 23 విభాగాలలో 300 మంది వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాలను, అత్యవసర వైద్య వాహనాలను నియమించి మహాదేవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రధాన ఆసుపత్రిగా మార్చారు. నిరంతర నిఘా కోసం ఘాట్లు, ఆలయం, పార్కింగ్ ప్రాంతాలలో 200 నిఘా కెమెరాలను, పారిశుద్ధ్య నిర్వహణకు 300 మంది సిబ్బందిని నియమించారు. పుష్కర స్నానాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రక్షణ బృందాలతో పాటు సుమారు 100 మంది గజ ఈతగాళ్లను, రక్షణ పడవలను, విపత్తు ప్రతిస్పందన బృందాలను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో సిద్ధంగా ఉంచారు. అలాగే పుష్కర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమాచార కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు.

## 'భారత్ భవిష్యత్ నగరం'ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి.. సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, 21 మే 2026: తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్ భవిష్యత్ నగరం'ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరిపాలనా సిబ్బంది శిక్షణ సంస్థ ప్రాంగణంలో పరిశ్రమల శాఖపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మరియు ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కాబోయే ఈ సరికొత్త నగరం పర్యావరణహితంగా, కాలుష్య రహిత నమూనాలోనే రూపకల్పన జరగాలని, మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. ప్రాథమిక మౌలిక సదుపాయాలను పూర్తిగా అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు జరపాలని, అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఇక్కడికి తీసుకురావాలన్నారు. ఈ నగరంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పాత్రికేయుల కోసం ప్రత్యేకంగా 500 ఎకరాలను కేటాయించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య కేంద్రాన్ని ఇక్కడికే వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే తానే స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి విజ్ఞప్తి చేస్తానని చెప్పారు. జూన్ నాటికల్లా పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపనలు జరగాలని, భూ కేటాయింపు జరిగిన వెంటనే నిర్మాణాలు మొదలుపెట్టేలా నిబంధనలు విధించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాలయం, ఆకర్షణీయమైన అధికారిక చిహ్నం, అంతర్జాల వేదికను రూపొందించాలని, పెట్టుబడిదారులకు సహాయంగా ఉన్నత స్థాయి అధికారితో ప్రత్యేక సహాయక వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేయాలని, వేగవంతమైన రైలు మార్గం కోసం భూసేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. ఈ నగరంలో 1500 ఎకరాల్లో సమాచార సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, దీని నీటి అవసరాలకు శుద్ధి చేసిన జలాలను వినియోగించాలన్నారు. అలాగే ద్వితీయ శ్రేణి నగరాలైన కరీంనగర్, వరంగల్, విజయవాడ ప్రాంతాల్లో ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రాలు, సమాచార నిల్వ కేంద్రాల ఏర్పాటుకు రహదారుల సమీపంలోని ప్రభుత్వ భూములను గుర్తించి కొత్త విధానాన్ని తీసుకురావాలని, రాబోయే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ అంతర్జాల నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు.

## ఎండల తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, 21 మే 2026: రాష్ట్రంలో తీవ్రమైన వడగాల్పులు, ఎండల తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున, ఆయా జిల్లాల అధికారులు తక్షణమే రంగంలోకి దిగి అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ఓఆర్ఎస్ ప్యాకెట్లను తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, అలాగే ఎండల నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అంతా పూర్తి అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ బారినపడి ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే వారికి తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రజలు కూడా సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆయా జిల్లాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.



## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి

సందేశం టైమ్స్, మునిపల్లి, మే 21, ప్రతినిధి: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మునిపల్లి మండలం చెల్మెడ కలాన్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ జొన్నలను ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి క్వింటాలుకు రూ.3,699 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గయ్య, గ్రామ సర్పంచ్ రాధాభాయ్ జోషి, గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీఏసీఎస్ కార్యదర్శులు శివారెడ్డి, వినోద్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.




## వి. విశ్వాస్ – రాణెమ్మ దంపతులకు ఘనంగా వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సందేశం టైమ్స్, వట్‌పల్లి, మే 21, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పరిధిలోని బూత్కూర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు వి. విశ్వాస్, శ్రీమతి రాణెమ్మ దంపతులకు వారి వివాహ వార్షికోత్సవ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబంలో జన్మించిన విశ్వాస్ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి విశ్వాసాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆలోచన, వాక్చాతుర్యం, ఆచరణతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ దంపతులు సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో వైవాహిక జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు, మేడికుండ వారు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కొల్లూరు ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం





సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 21, టౌన్ రిపోర్టర్ వి. సాయి: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కొల్లూరు ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న లారీ ముందుగా వెళ్తున్న డీసీఎంను ఢీకొట్టడంతో డీసీఎం వాహనం నుజ్జునుజ్జయింది. వాహనంలో ఉన్న ధాన్యం రోడ్డుపై చెల్లాచెదురై పాడైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



## కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేనలో చేరిన పలువురు నాయకులు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 21, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు నాయకులు గురువారం కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. సంగారెడ్డి జిల్లా నాయకుడు అరవింద్ రెడ్డి, మునిపల్లి మండల నాయకుడు భాస్కర్ రెడ్డి, మోమిన్‌పేట్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు విజయ్‌తో పాటు పలువురు నాయకులు పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, తెలంగాణ అభివృద్ధి కోసం నాయకత్వానికి అండగా నిలుస్తామని తెలిపారు. నాయకుల చేరికతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

## మరవెల్లిలో ఉత్సాహంగా క్రికెట్ ఆడుతున్న యువకులు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 21, జిల్లా సమన్వయకర్త బి. సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలోని వట్‌పల్లి మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో గ్రామ యువకులు, విద్యార్థులు కలిసి ఉత్సాహంగా క్రికెట్ ఆడుతూ సందడి చేశారు. గ్రామ శివారులో నిర్వహించిన ఈ ఆటల్లో యువకులు, విద్యార్థులు ఎంతో ఆనందంగా పాల్గొని సమ్మర్ సీజన్‌ను ఆస్వాదించారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కూడా కలిగిస్తాయని యువకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మరవెల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ నూతన డైరెక్టర్‌గా హమీద్‌కు శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 21, బి. డేవిడ్: పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్‌గా హమీద్ ఎన్నికైన సందర్భంగా బుధవారం పటాన్‌చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ హమీద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, రవీంద్ర చారి, కార్ రాజు, మెట్టు కళ్యాణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాజు స్వామి కుమారుని ఘనంగా జన్మదిన వేడుకలు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 21, బి. డేవిడ్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీవాసి శ్రీ కాజు స్వామి కుమారుని జన్మదిన సందర్భంగా నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ హాజరై జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాజు స్వామి కుమారుడిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీధర్ చారి, గోపాల్ రెడ్డి, రాజిరెడ్డి, పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రభాకర్ కుమారుడి తొలి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు




సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మే 21, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్ కుమారుడి తొలి జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, న్యాల్‌కల్ మండల అధ్యక్షులు నవీన్ కుమార్, సీనియర్ జర్నలిస్టు జ్ఞానేశ్వర్, న్యాల్‌కల్ బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ తదితరులు హాజరై చిన్నారికి ఆశీర్వాదాలు అందించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించగా గ్రామస్థులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారి ఆయురారోగ్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



## చరిత్ర ఆనవాళ్లకు ప్రసిద్ధి చెందిన మెదక్ పర్యాటక ప్రాంతాలు: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 21, నియోజకవర్గ ప్రతినిధి: మెదక్ జిల్లా సుసంపన్నమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాల ఉనికిని భావితరాలకు అందించేలా డాక్యుమెంటరీలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా బుధవారం హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రమాదేవి, వివిధ శాఖల అధికారులు, యువత, క్రీడాకారులు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెస్లీ పాఠశాల, మెదక్ చర్చ్, గుల్షన్ క్లబ్, మెదక్ ఫోర్ట్ ప్రాంతాలను సందర్శించి హెరిటేజ్ వాక్ నిర్వహించారు. మెదక్ ఫోర్ట్ చారిత్రాత్మక పర్యాటక కేంద్రంగా పర్యాటకులను ఆకర్షిస్తోందని, అక్కడ మరమ్మతులు, శానిటేషన్ డ్రైవ్, లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి యువతను ఆకర్షించేలా అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని బురుజులు, చారిత్రాత్మక దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలపై డాక్యుమెంటరీలు రూపొందించి హెరిటేజ్ పుస్తక రూపంలో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాల కోసం సీఎస్ఆర్ నిధులు, రాష్ట్ర స్థాయి నిధులను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

## చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, మే 21, నియోజకవర్గ ప్రతినిధి: రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులు అధైర్యపడకుండా మధ్యవర్తులను ఆశ్రయించవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, సివిల్ సప్లై అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతం కంటే అత్యంత వేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. ఎలాంటి అక్రమాలు లేకుండా పారదర్శకంగా ఈరోజు వరకు 2,00,602.200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 39,541 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని, అందులో 27,600 మంది రైతుల ఖాతాల్లో రూ.286.60 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, అకాల వర్షాల నుంచి రక్షించేందుకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, మిల్లర్లు అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సూచించారు.

## బడిబాటతో విద్యా వెలుగు.. ముస్లాపూర్ పీఎం శ్రీ పాఠశాలలో చేరికలకు ఉపాధ్యాయుల ప్రచారం







సందేశం టైమ్స్, అల్లాదుర్గం, మే 21, ప్రతినిధి: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం పరిధిలోని ముస్లాపూర్ పీఎం శ్రీ జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం బహిరన్ దిబ్బ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలోని విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను పీఎం శ్రీ జడ్‌పీహెచ్‌ఎస్ ముస్లాపూర్ పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ విద్య, విశాలమైన గ్రంథాలయం, క్రీడా సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం, పదవ తరగతి ఉత్తమ ఫలితాలు, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి నిర్వహిస్తున్న విద్యా, సాంస్కృతిక కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, జూన్ నెల నుంచి టిఫిన్‌తో పాటు విద్యార్థులకు అవసరమైన కిట్ అందజేయనున్నట్లు తెలియజేశారు. ప్రతి విద్యార్థి చదువుతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల కార్యక్రమాన్ని అభినందిస్తూ తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. రమేష్, బహిరన్ దిబ్బ సర్పంచ్ పి. వీరప్ప, ఉపాధ్యాయులు జనార్దన్, సంతోష్, యాదయ్య, పంచాయతీ కార్యదర్శి స్వరూప, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోషియోస్పోర్ట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ కిట్ల పంపిణీ




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 21, మెదక్ నియోజకవర్గ ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలో సోషియోస్పోర్ట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూన వేణు చేతుల మీదుగా విద్యార్థులు వాలీబాల్ కిట్లను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కూన వేణు లాంటి మంచి మనసున్న వ్యక్తి తమకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ క్రీడా సామగ్రితో పాటు పలు రకాల సహాయాలు అందిస్తున్నారని తెలిపారు. ఎవరు సహాయం కోరినా కాదు అనకుండా ముందుకు వచ్చి సహకరిస్తున్నారని కొనియాడారు. కూన వేణు ఆయురారోగ్యాలతో ఉండాలని, మరెన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించాలని విద్యార్థులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

## నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలి: దానకిషోర్







సందేశం టైమ్స్, మెదక్, మే 21, నియోజకవర్గ ప్రతినిధి: నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి సెర్ప్ సీఈఓ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ నరేగా కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేసి ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పనులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు పనుల్లో పాల్గొంటుండగా ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి ప్రధాన పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రాబోయే 40 రోజుల్లో మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తిగా వినియోగించాలని, ఎంపీడీవోలు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి సారించాలని తెలిపారు. రాష్ట్రంలో 41 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, లైవ్ అథెంటికేషన్ సర్వే ద్వారా కొత్త అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. మెదక్ జిల్లాలో నిర్వహించిన పైలట్ సర్వేలో సుమారు 9 శాతం మంది లబ్ధిదారులు మరణించినట్లు గుర్తించామని తెలిపారు. ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలని, స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేద కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తామని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేపట్టాలి: ఆర్డీవో రమాదేవి



సందేశం టైమ్స్, మెదక్, మే 21, నియోజకవర్గ ప్రతినిధి: ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జూలై 25 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తారని తెలిపారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ వివరాలు తెలిసేలా పేరు, మొబైల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి రికార్డులను నవీకరించాలని తెలిపారు. బీఎల్ఓలు తమ పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ అధికారులు పాల్గొన్నారు.

## కళలకు నెలవు మెదక్ జిల్లా: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్, మే 21, నియోజకవర్గ ప్రతినిధి: మెదక్ జిల్లా కళలకు నెలవని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మెదక్ జిల్లా వివిధ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని, కళలకు ప్రత్యేక గుర్తింపు ఉన్న జిల్లాగా పేర్కొన్నారు. భవిష్యత్తులో కళలకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాశ్ రావు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక

# సందేశం టైమ్స్

గురువారం 21 మే 2026






## పక్కా ఓటర్ల జాబితా తయారే లక్ష్యం: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 21, ప్రతినిధి: ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన పక్కా ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం మరియు రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, ఖచ్చితమైన విచారణతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని, ప్రతి పార్టీ వెంటనే బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తూ ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జూన్ 15 నుంచి ప్రారంభమై అక్టోబర్ 1న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఇంటికి వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసి అర్హులైన వారిని నమోదు చేయాలని, మరణించిన లేదా వలస వెళ్లిన వారి పేర్లు తొలగించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా, ఓటరు కేంద్రం 2 కిలోమీటర్లలోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 1-10-2026 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి యువతీ యువకుడు ఫారం-6 ద్వారా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ అభియాన్ పురోగతి సమీక్ష

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 21, ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ 54 రోజుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం ప్రోగ్రాం అధికారులు, ఎస్టీఎల్ఎస్, ఫార్మసిస్టులతో జరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ట్యూబర్క్యులోసిస్ పరీక్షల కోసం నమూనాల సేకరణను పెంచాలని, ప్రయోగశాలల్లో పరీక్షల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ప్రాథమిక పరీక్షల్లో నెగటివ్ వచ్చినా లక్షణాలు ఉంటే ట్రూనాట్ లేదా సీబీనాట్ పరీక్షలకు పంపాలని తెలిపారు. ల్యాబ్ రిజిస్టర్లు, నిక్షయ్ పోర్టల్‌లో ఫలితాలను సమయానుకూలంగా నమోదు చేయాలని, డాట్స్ మందుల నిల్వలో కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు 21 గ్రామపంచాయతీలు టీబీ ముక్త్‌గా మారినట్లు ఆయన తెలిపారు. మార్చి 24 నుంచి 140 ప్రత్యేక నిర్ధారణ శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక చేయగా ఇప్పటివరకు 70 శిబిరాలు పూర్తయ్యాయని వెల్లడించారు. 6,818 ఎక్స్‌రేలు, 2,941 ల్యాబ్ పరీక్షలలో 149 టీబీ కేసులు గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. 190 మందికి టీపీఐటీ, 199 మందికి నిక్షయ్ పోషణ కిట్లు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిబి యూనిట్ అధికారులు డా. పి. వెంకట పాపిరెడ్డి, డా. శ్రీశైలం, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలి: దాన కిషోర్



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 21, ప్రతినిధి: నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి సెర్ప్ సీఈఓ దివ్యతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ నరేగా కింద వేజ్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామంలో కనీసం 20 పనులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. రోజుకు 20 లక్షల మంది కార్మికులతో పనులు నిర్వహించే లక్ష్యంతో చర్యలు తీసుకోవాలని చెప్పారు. నరేగా పథకం జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్త పథకం అమల్లోకి రానుందని తెలిపారు. ఎంపీడీవోలు రాబోయే 40 రోజుల పాటు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. మెటీరియల్ కాంపోనెంట్ నిధులను త్వరగా వినియోగించాలని సూచించారు. రాష్ట్రంలో 41 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, లైవ్ అథెంటికేషన్ సర్వే ద్వారా కొత్త అర్హులకు పెన్షన్ మంజూరు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలని సూచించారు. స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హ కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీలో సగటున 160 మంది కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామని, రాష్ట్రంలో జిల్లా మూడవ స్థానంలో ఉందని తెలిపారు. అవసరమైతే ఇంటి వద్దనే పని కల్పించాలని, ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పనులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 21, ప్రతినిధి: 2026–27 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు టి. అఖిలేష్ రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా 20.05.2026 నుంచి 05.06.2026 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 2026లో పదవ తరగతి ఉత్తీర్ణులై 400 మార్కులు లేదా అంతకంటే ఎక్కువ సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, తెలంగాణ రెసిడెన్షియల్, ఎయిడెడ్, బెస్ట్ అవైలబుల్, నవోదయ, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ మరియు కళాశాల కేటాయింపు 12.06.2026న నిర్వహించబడుతుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు సమయానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని శాఖ సూచించింది.

## 27 నుంచి పాలీసెట్ కౌన్సిలింగ్ ప్రారంభం





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 21, ప్రతినిధి: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలీసెట్–2026 వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈనెల 27 నుంచి ప్రారంభమవుతుందని సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి. జానకి దేవి తెలిపారు. పాలీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 27 నుంచి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. 29వ తేదీ నుంచి జూన్ 3 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 6న సీట్ల కేటాయింపు జరగనుందని తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియను అనుసరించి విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలలో ప్రవేశం పొందాలని సూచించారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పటాన్‌చెరు తొంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 21, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమాల్లో టూరిజం వారోత్సవం సందర్భంగా బుధవారం పటాన్‌చెరు తొంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి టి. అఖిలేష్ రెడ్డి, విద్యార్థులు, యువత, మున్సిపల్ అధికారులు, టూరిజం శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వ కట్టడాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పటాన్‌చెరు తొంబ్స్ ప్రాంతం చరిత్రకు ప్రతీకగా నిలుస్తుందని, యువతలో వారసత్వ సంపదపై అవగాహన పెంపొందించేందుకు హెరిటేజ్ వాక్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. టూరిజం వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రజలకు చేరువ చేస్తూ చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, యువత చరిత్రను తెలుసుకొని వారసత్వ సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభం






సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 21, ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 మరియు ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950 సెక్షన్ 21 ప్రకారం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించారు. 01.10.2026ను అర్హత తేదీగా నిర్ణయించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 15 నుంచి 24 వరకు సిబ్బందికి శిక్షణ, ప్రింటింగ్ తదితర ఏర్పాట్లు చేపట్టనుండగా, జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ప్రతి ఇంటిని బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలను రెండు ప్రతులుగా అందజేసి, వాటిని ఎలా నింపాలో మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. ఇళ్లు తాళం వేసి ఉంటే కనీసం మూడు సార్లు సందర్శిస్తారని, అవసరమైతే ఆన్‌లైన్‌లో కూడా ఫారాలు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనుండగా, ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫారం–6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం–8 ద్వారా సవరణలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తైన తర్వాత అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.